జీవో 22ను అమలుచేయండి

రామవరం, ఫిబ్రవరి 25 : జీవో నెంబర్ 22 అమలుచేసి మా జీవితాల్లో వెలుగులు నింపండి సారూ అంటూ సింగరేణి సంస్థలో ఒప్పంద కార్మికులు సీఎండీ ఎన్.బలరాంను కోరారు. ఆదివారం సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో 10.5 మెగా వాట్ల సోలార్ పవర్‌ప్లాంట్ ప్రారంభోత్సవానికి వచ్చిన సందర్భంగా వారు ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేశారు. వారివెంట కాంట్రాక్టు కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం అధ్యక్షుడు రాసూరి శంకర్, గూడెల్లి యాకయ్య, ఇంద్రనిల్, బాషబోయిన రవి, సాధిక్‌పాషా, మహ్మద్ షకీల్, సరోజిని, లక్ష్మీకాంతం, సునీల, కాంట్రాక్టు కార్మికులు ఉన్నారు.

మణుగూరులో పర్యటించిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి

రేగాతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి

మణుగూరుటౌన్, ఫిబ్రవరి 25: ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి ఆదివారం మణుగూరులో పర్యటించారు. పినపాక మాజీఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావును కలిసి త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వట్టం నారాయణ, యూసఫ్ షరీఫ్, తాళ్లపల్లి యాదగిరిగౌడ్, నూకారపు రమేశ్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ. లక్ష వితరణ

దాతలు శారదమ్మ, నరేందర్

అశ్వాపురం, ఫిబ్రవరి 25: మండలంలోని మొండికుంట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణానికి హన్మకొండకు చెందిన గారపాటి మోహనరావు జ్ఞాపకార్థం ఆయన సతీమణి గారపాటి శారదమ్మ, కుమారుడు గారపాటి నరేందర్ ఆదివారం రూ.లక్ష ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

టాలెంట్ టెస్ట్‌లో 'బ్రిలియంట్' విద్యార్థుల ప్రతిభ

ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

సారపాక, ఫిబ్రవరి 25: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌లో సారపాక బ్రిలియంట్ పాఠశాలకు చెందిన కే నవనీత్, కే సతీశ్‌గౌడ్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు బ్రిలియంట్ విద్యాసంస్థల అధినేత బీఎన్ఆర్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా వారిని అభినందించి జిల్లా స్థాయి పోటీలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా టెన్త్ పరీక్షల్లో కూడా ప్రథమస్థానం సాధించాలని కోరారు.

విగ్రహం ఆవిష్కరణ

విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

టేకులపల్లి, ఫిబ్రవరి 25: మండలంలోని కోయగూడెం గ్రామానికి చెందిన యాదవ సంఘం మాజీ నాయకుడు జాల వెంకయ్య విగ్రహాన్ని సభ్యులు మద్రాస్‌తండా రోడ్డు పక్కన ఏర్పాటు చేశారు. దీనిని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదివారం ఆవిష్కరించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు జాల సంధ్య, కోరం సురేందర్, కోరం ఉమ, పెరుగు సత్యనారాయణ, ధర్మయ్య గౌడ్, జాల మురళి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి మారాయిగూడెం జాతర

మారాయిగూడెంలోని సమ్మక్క, సారలమ్మ ఆలయం

ఆలయ ప్రాంతంలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 25: మినీ మేడారంగా పేరున్న మండలంలోని మారాయిగూడెం సమ్మక్క, సారలమ్మ జాతర మంగళవారం నుంచి మార్చి 2వ తేదీ వరకు ఐదు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. జాతరలో పూజారులుగా మారాయిగూడెం గ్రామానికి చెందిన సోడె శాంతమ్మ, మడకం అచ్చమ్మ వ్యవహరిస్తారు. ఈ జాతర ఏర్పాట్లను ఆలయకమిటీ నిర్వాహకులు ఇప్పటికే పూర్తిచేశారు. మహాజాతరకు తెలంగాణతో పాటు సరిహద్దు రాష్ట్రాలైన చత్తీస్‌గఢ్, ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్ నుంచి భక్తులు వేలాదిగా తరలిరానున్నారు. తొలిసారిగా 1992లో జాతర ప్రారంభించి ఆనాటి నుంచి నేటి వరకు మేడారం జాతర అనంతరం నాలుగు రోజుల వ్యవధిలో ఇక్కడ జాతర నిర్వహిస్తారు. ప్రతి ఏడాది రెండేళ్లకొకసారి ఇక్కడ ఈ జాతర నిర్వహించడం ఆనవాయితీ.

జాతర జరిగేది ఇలా....

మారాయిగూడెం సమ్మక్క, సారలమ్మ జాతర ఈనెల 27వ తేదీన (మంగళవారం) అట్టహాసంగా ప్రారంభం కానుంది. 27న మండ వెలుగుట, 28న ఒక్క పొద్దు, రాత్రి 10 గంటలకు దేవత నిశానులు, సారలమ్మ గుడికి వస్తాయి. 29 సాయంత్రం 4 గంటలకు నిండు జాతర, మార్చి 1వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు వనదేవత గుడికి చేరును. సాయంత్రం 4 గంటలకు తల్లిదేవత గుట్ట నుంచి గుడికి వస్తాయి. 2వ తేదీన శంకు పండుగ దేవుని దర్శనంతో జాతర పూర్తవుతుందని నిర్వాహకులు తెలిపారు.

అథ్లెటిక్స్‌లో జిల్లావాసులకు పతకాలు

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 25 : తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్, కొల్లూరులో జరిగిన చాంపియన్‌షిప్‌లో జిల్లావాసులు పతకాలు సాధించారు. పురుషుల విభాగంలో భద్రాచలానికి చెందిన వర్సరాజు 400 మీటర్ల పరుగుపందెంలో బంగారు పతకం, 14 సంవత్సరాలలోపు విభాగంలో భద్రాచలానికి చెందిన సాయి ఆదిత్య వంశీ 400 మీటర్ల పరుగుపందెంలో రజిత పతకాన్ని గెలుచుకున్నారు. ఈ సందర్భంగా పర్సరాజు, కోచ్ శ్రీనివాసరావు, సాయి ఆదిత్య వంశీ, కోచ్ శివకుమార్‌ను జిల్లా అథ్లెటిక్ అసోషియేషన్ అధ్యక్షుడు గొట్టపు రాధాకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.హనుమంతరావు, జిల్లా ఒలింపిక్ అసోషియేషన్ ట్రెజరర్ రాసపల్లి రాజేందర్‌ప్రసాద్ అభినందించారు.

రాష్ట్రస్థాయి పతకాలతో పర్సరాజు, సాయిఆదిత్యవంశీ

తిరుపతమ్మ అమ్మవారి కల్యాణం

తిరుపతమ్మ కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

సారపాక/బూర్గంపహాడ్, ఫిబ్రవరి 25: మండలంలోని ముసలిమడుగు పంచాయతీ పరిధిలోని మణుగూరు క్రాస్‌రోడ్‌లోని శ్రీతిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో శ్రీగోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారి కల్యాణాన్ని అర్చకులు శనివారం రాత్రి నిర్వహించారు. జరిగింది. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, సొసైటీ మాజీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ధనలక్ష్మి దంపతులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణంలో పాల్గొన్నారు. తొలుత ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు.

సారపాకలో...

తాళ్లగొమ్మూరులో సాకేతపురి శ్రీసత్యనారాయణస్వామి(సత్యదేవుని) ఆలయంలో వెంకటేశ్వరస్వామి కల్యాణాన్ని శనివారం రాత్రి నిర్వహించారు. కల్యాణంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో లాస్య ఇండస్ట్రీస్ అధినేత ఇంగువ రమేశ్, బాదం రమేశ్‌రెడ్డి, దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, ఓబుల్‌రెడ్డి, నాగిరెడ్డి, పూలపెల్లి సుధాకర్‌రెడ్డి, అర్చకులు, భక్తులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఉత్తమ కార్మికులకు సన్మానం

కార్మిక సంఘం కార్యాలయంలో సన్మానం అందుకున్న కార్మికులు

పాల్వంచ, ఫిబ్రవరి 25 : పట్టణంలోని కేటీపీఎస్ కాలనీలో గల తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ 1104 యూనియన్ కార్యాలయంలో ఆదివారం ఉత్తమ కార్మికులను ఘనంగా సన్మానించారు. సత్తుపల్లి ఎన్పీడీసీఎల్‌లో జేఎల్ఎంగా పనిచేస్తున్న బొల్లగాని సాయిపవన్, కేటీపీఎస్‌లో ఫోర్‌మెన్‌గా పనిచేస్తున్న జి.వెంకటేశ్వర్లు ఉత్తమ కార్మికులుగా అవార్డులు అందుకున్న సందర్భంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు జమ్ముల సీతారామరెడ్డి, పాతూరి రవీందర్‌రెడ్డి, కంటె రాజేందర్, కేశబోయిన కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, రాము, నరేందర్, చెరుకు ఆశోక్, కుమార్, ఇస్లావత్, రాజేష్, ఏసాబు, యాకూబ్, రమేశ్, బిచ్చానాయక్, గణపతి, రాజేష్, నరేశ్ పాల్గొన్నారు.

రోటరీ, ఆస్టర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆరోగ్య సేవలు

ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో వైద్యులు, రోటరీ, ఆస్టర్ నిర్వాహకులు

బూర్గంపహాడ్, ఫిబ్రవరి 25: రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం పేరుతో రోటరీ, ఆస్టర్ గ్రూప్ హాస్పటల్స్ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య సేవలు నిర్వహిస్తున్నట్లు రోటరీ గవర్నర్ బూసిరెడ్డి శంకర్‌రెడ్డి, ఆస్టర్ గ్రూప్ హాస్పటల్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ దేవానంద్ తెలిపారు. ఆదివారం మండలంలోని నాగినేనిప్రోలు రెడ్డిపాలెంలో ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 8వేల మందికి పరీక్షలు చేసి మందులు అందజేస్తామన్నారు. దశలవారీగా ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ప్రాథమిక దశలో ఆస్టర్, రోటరీక్లబ్‌ల సహకారంతో రెడ్డిపాలెంలోని అన్ని కాలనీలకు చెందిన వారిని స్థానిక వలంటీర్ల సహకారంతో ప్రతి నెల వైద్యశిబిరాల ద్వారా ప్రాథమిక డేటా సేకరిస్తామని పేర్కొన్నారు. డేటా ప్రకారం 100శాతం జబ్బులను గుర్తించి ట్రీట్‌మెంట్ ప్లాన్ చేసి వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు చేస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యులు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

తూకంలో మోసం...

కాంటా వేసే వ్యక్తిని పట్టుకున్న వైనం

మోసం చేసిన వ్యక్తిని బంధించిన రైతులు

రైతులను మోసం చేసిన రిమోట్

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 25: ఆరుగాలం కష్టించి పంట పండించిన మిర్చి రైతును తూకంలో మోసం చేసేందుకు కొందరు ప్రయత్నించగా గమనించిన రైతులు కాంటా వేసే వ్యక్తిని పట్టుకున్న ఘటన మండలంలోని మారాయిగూడెం గ్రామంలో ఆదివారం చోటుచేసుకున్నది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... సుజాతనగర్‌కు చెందిన కొందరు దళారులు మారాయిగూడెంలో రైతుల నుంచి మిర్చి కొనుగోలు చేసేందుకు శనివారం వచ్చి క్వింటాకు రూ.18,500 చొప్పున మిర్చి కొనుగోలు చేశారు. ఆదివారం ఉదయం మిర్చిని రైతు సోంది రాజు దగ్గర కొనుగోలు చేస్తుండగా కాంటా వేసేటప్పుడు రిమోట్ నొక్కుతూ తూకం వివరాలు ఓ పుస్తకంపై రాస్తున్నాడు. మిర్చి విక్రయిస్తున్న రైతుకు అనుమానం వచ్చి ఆ కూలీని నిలదీస్తూ తూకం వేయగా సుమారు 20 నుంచి 30 కిలోల తూకంలో తేడా వచ్చినట్లు గుర్తించాడు. అప్పటికే ఆ కూలీతో ఉన్న దళారులు వాహనాలపై పరారయ్యారు. ఈ వ్యక్తిని పట్టుకుని పక్కనే ఉన్న చెట్టుకు కట్టేశారు. పట్టుబడిన వ్యక్తి తాను కూలీ పనికి వచ్చానే తప్ప ఈ విషయంలో నా ప్రమేయం లేదని తెలిపినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. మిర్చి తూకంలో దళారుల కారణంగా రైతులు మోసపోయినట్లు ఆలస్యంగా తెలిసింది.

వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం

ఆహ్వానపత్రికల ఆవిష్కరణ

వేంకటేశ్వరస్వామి కల్యాణ శుభపత్రికలను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ వివేక్, కమిటీ సభ్యులు

పాల్వంచ, ఫిబ్రవరి 25 : పాల్వంచ పట్టణంలోని శ్రీనివాసగిరి కొండపై ఉన్న పురాతన ఆలయం శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రికలను ఆదివారం ఆవిష్కరించారు. మార్చి 4వ తేదీన జరిగే స్వామివారి కల్యాణ ఆహ్వానపత్రికలను పాల్వంచ తహసీల్దార్ వివేక్, ఆలయ భక్త సమాజమండలి అధ్యక్షుడు ఆరుట్ల లక్ష్మణాచార్యుల చేతుల మీదుగా కమిటీ సభ్యులు విడుదల చేశారు. స్వామివారి కల్యాణాన్ని అత్యంత వైభవోపేతంగా ప్రతి ఏటా నిర్వహిస్తుంటారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో భక్త సమాజ మండలి కమిటీ సభ్యులు పసుమర్తి వెంకటేశ్వరరావు, ధర్మపురి రాము, ఊకే భద్రయ్య, కందుకూరి రాము, తాటికొండ శ్రీలత, పిట్లా లక్ష్మీరెడ్డి, బండి నారాయణ, ఏటుకూరి నరేష్, జిన్నే రమేశ్, బండి రాంతః, వంకదరు నర్సింహకుమార్, వేమూరి వెంకటేశ్వరరావు, మిట్లపల్లి నర్సింహారావు, రాజా సురేంద్రాచారి, గడ్డం వెంకటసుబ్బయ్య, చనుమాలు శ్రీను, గడ్డం వెంకటనారాయణ, పుర ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

రాజేశ్వరరావుకు పరామర్శ

రాజేశ్వరరావును పరామర్శిస్తున్న రేగా కాంతారావు

దమ్మపేట, ఫిబ్రవరి 25: బీఆర్ఎస్ దమ్మపేట మండల అధ్యక్షుడు దొడ్డాకుల రాజేశ్వరరావును బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆదివారం పరామర్శించారు. రాజేశ్వరరావు ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకుని మండల పరిధిలోని పట్వారిగూడెంలోని స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. వైద్యుల సూచనలు పాటిస్తూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు, మూడు ఎడ్లబండ్లు పట్టివేత

సారపాకలో ఎడ్లబండిని పట్టుకున్న రెవెన్యూ అధికారులు

సారపాక/బూర్గంపహాడ్, ఫిబ్రవరి 25: మండలంలోని బుడ్డగూడెంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు, సారపాక బ్రిడ్జి కింద మూడు ఎడ్లబండ్లను శనివారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. రాత్రి సమయంలో అనధికార ర్యాంపుల వద్ద డీటీ రాంనరేశ్, ఆర్ఐలు ముత్తయ్య, నర్సింహారావు, రెవెన్యూ సిబ్బంది వినోద్, మహేశ్, సంపత్ గస్తీ కాస్తూ ఎఅక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నారు. అక్రమ ఇసుక రవాణా చేసే ఎంతటివారినైనా వదిలేది లేదని తహసీల్దార్ హెచ్చరించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు బీజేపీ విజయ సంకల్ప యాత్ర

దమ్మపేట, ఫిబ్రవరి 25 : దమ్మపేటలో సోమవారం బీజేపీ విజయ సంకల్ప యాత్ర జరగనున్నదని, దీనికి అవసరమైన ఏర్పాట్లను బీజేపీ నాయకత్వం పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఇద్దరు జూదరుల అరెస్ట్

అశ్వారావుపేట, ఫిబ్రవరి 25: దురదపాడు శివారులో ఆదివారం కొందరు కోడి పందేల శిబిరం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎస్సై శ్రీరాముల శ్రీను, పోలీస్ సిబ్బందితో కలిసి దాడులు చేశారు. ఇద్దరు జూదరులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.2,150 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఒక ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అన్నివర్గాల సంక్షేమం కాంక్షించేది బీజేపీ మాత్రమే

మాట్లాడుతున్న కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

మణుగూరుటౌన్, ఫిబ్రవరి 25: అన్నివర్గాల సంక్షేమం కాంక్షించే పార్టీ బీజేపీ మాత్రమేనని కామారెడ్డి ఎమ్మెల్యే, బీజేపీ శాసనసభాపక్ష ఉపనేత కాటిరెడ్డి వెంకటరమణారెడ్డి అన్నారు. బీజేపీ చేపట్టి విజయ సంకల్పయాత్ర ఆదివారం మణుగూరుకు చేరుకుంది. పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన మాటప్రకారం అయోధ్యలో రామమందిర నిర్మించారని, కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి అభివృద్ధి చేశారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు అని అబద్ధపు హామీలిచ్చి అధికారం చేజిక్కించుకుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తనేని ధర్మారావు, జిల్లా అధ్యక్షులు రంగా కిరణ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

మాణిక్యమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

భద్రాచలం, ఫిబ్రవరి 25: పట్టణంలోని సీతారామనగర్ కాలనీకి చెందిన తమ్మళ్ల మాణిక్యమ్మ (63)ను ఈ నెల 15న ఆమె ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు దాడిచేశారు. మాణిక్యమ్మను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతిచెందింది. మృతదేహాన్ని హైదరాబాద్ నుంచి శనివారం రాత్రి భద్రాచలం తీసుకొచ్చి పోస్ట్‌మార్టం నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, బీఆర్ఎస్ భద్రాచలం మండల అధ్యక్షుడు అరికెల్ల తిరుపతిరావు ఆదివారం ఉదయం మాణిక్యమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళి అర్పించిన వారిలో పట్టణ ప్రముఖులు గాదె మాధవరెడ్డి, ఎస్‌కే అజీమ్ తదితరులు ఉన్నారు.

జర్నలిస్ట్ శంకర్‌పై దాడి హేయమైన చర్య

అశ్వారావుపేట, ఫిబ్రవరి 25 : ప్రజా సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే మీడియాపై దాడి అత్యంత హేయమైన చర్యగా బీఆర్ఎస్ నేతలు కాసాని చంద్రమోహన్, వగ్గెల పూజ, సత్యవరపు సంపూర్ణ, మోటూరి మోహన్ అభిప్రాయపడ్డారు. తక్షణమే శంకర్‌పై దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. పట్టణంలో ఆదివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇప్పటికైనా దాడులు ఆపకపోతే భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు సోమాని రాజా రమేశ్, వెంకన్న, కాంతారావు, సాయి, ధర్మారావు, శివ, బాలు పాల్గొన్నారు. న్నారు.

శారదకు నివాళి

భద్రాచలం, ఫిబ్రవరి 5: ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ భద్రాచలం డివిజన్ అధ్యక్షుడు బందు వెంకటేశ్వరరావు సతీమణి బందు శారత తృతీయ వర్ధంతిని పట్టణంలోని ఆల్ పెన్షనర్స్ కార్యాలయంలో నిర్వహించారు. తొలుత ఆమె చిత్రపటానికి జిల్లా అధ్యక్షుడు చల్లగుళ్ల నాగేశ్వరరావు పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కేఎస్ఎల్వీ ప్రసాద్, నాళం సత్యనారాయణ, సుబ్బయ్య చౌదరి, చుక్కా రాంబాబు, కిషన్‌రావు, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

మృతదేహం ఆచూకీ లభ్యం

అశ్వాపురం, ఫిబ్రవరి 25: మండలంలోని తుమ్మల చెరువులో శనివారం కనుగొన్న గుర్తుతెలియని మృతదేహం ఆచూకీ లభ్యమైంది. తుమ్మలచెరువు గ్రామ పంచాయతీ కోరెంవారి గుంపునకు చెందిన పాయం బసవయ్య (35)గా గుర్తించారు. మృతుడి ఒంటిపై ఉన్న గుర్తుల ఆధారంగా స్థానికులు గుర్తించారు.

గ్రంథాలయ ఏర్పాటుపై అఖిలపక్ష సమావేశం

మాట్లాడుతున్న అఖిలపక్షం నాయకులు

చండ్రుగొండ, ఫిబ్రవరి 25 : మండల కేంద్రంలోని గ్రంథాలయ ఏర్పాటు కోసం అన్ని పక్షాలు తమవంతు సహాయ, సహకారాలు అందించాలని అఖిలపక్షం నాయకులు రాజకీయపక్షాలకు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సీపీఎం నాయకులు రాయి రాజా అధ్యక్షతన అఖిలపక్ష నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. గ్రంథాలయ నిర్మాణం కోసం అధికారపక్షం నాయకులు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి నిధులు సమీకరించాలన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

CHANGE OF NAME

★I, RACHARLA REKHA CHANGED MY NAME AS GUDELA REKHA W/O.GUDELA DURGA PRASAD R/O. H NO. 9-5-49, SANYASI BASTHI, KOTHAGUDEM-507101, BK DIST. KMM

WANTED

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899. NT-319443-All

★హైదరాబాద్‌లో అర్జెంటుగా కొండాపూర్‌కి సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. మంచి జీతం, భోజనం, వసతి కలదు. సంప్ర: 9392663777, 9246663777, 9290003999. NT-313897-All

FINANCIAL SERVICES

★రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార రుణం, అతి తక్కువ వడ్డీ రేటుతో, సిబిల్ అవసరం లేదు! NPA కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఏజెంట్స్ కావలెను. నొవా ఫైనాన్స్. ఫోన్: 7696660523. NT-311956-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించ కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616